క్లుప్తంగా

'ఆడుదాం ఆంధ్రా'ను జయప్రదం చేయండి

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా అన్నారు. 27వ డివిజన్ సచివాలయంలో గురువారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహణపై ఆయన వలంటీర్లతో సమీక్షించారు. 18 ఏళ్ల నిండిన క్రీడాకారులు దరఖాస్తు చేసుకుని ఆటల్లో పాల్గొని ప్రతిభను కనబరిచేలా వలంటీర్లు చర్యలు తీసుకోవాలన్నారు. మీమీ పరిధిలో ప్రతిభ ఉన్న క్రీడాకారులతో దరఖాస్తు చేయించాలని ఆయన కోరారు.

పింఛనుదారుల వితరణ

మచిలీపట్నంటౌన్: 29వ డివిజన్‌కు చెందిన పింఛనుదారుడు సయ్యద్ ఇస్మాయిల్ ఇటీవల మృతిచెందాడు. డివిజన్‌కు చెందిన తోటి పింఛనుదారులు ఒక్కొక్కరు రూ. 100 చొప్పున సేకరించిన రూ. 40 వేలను ఇస్మాయిల్ కుమారుడు సయ్యద్‌బాజీకి కార్పొరేటర్ కట్టా కేదారేశ్వరరావు సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ యర్రా శ్రీనివాస కుమార్, పింఛనుదారులు పాల్గొన్నారు.

సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులకు ఉద్యోగోన్నతి

పెడన: పట్టణంలో వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఇద్దరు ప్లానింగ్ అండ్ బిల్డింగ్ రెగ్యులేటర్ కార్యదర్శులకు టీపీబీఓగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ పురపాలక శాఖ ప్రణాళిక విభాగం డైరెక్టర్ విద్యుల్లత గురువారం ఉత్తర్వులు జారీ చేశారని కమిషనర్ మహేంద్ర తెలిపారు. పెడన మున్సిపాలిటీలోని 1, 5వ సచివాలయాల్లో ప్లానింగ్ అండ్ రెగ్యులేటర్ సెక్రటరీలుగా పనిచేస్తున్న బండి కిరణ్‌కుమార్, పామర్తి జితేంద్ర ఉద్యోగోన్నతి పొందారని వివరించారు.

బాధితులకు రూ.7.10 లక్షల సాయం పంపిణీ

నాగాయలంక: మిచాంగ్ తుపాను ప్రభావంతో నాగాయలంక మండలంలో 16 పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన తక్షణ సాయం పంపిణీ పూర్తయిందని తహసీల్దార్ జె.విమలకుమారి గురువారం తెలిపారు. మెత్తం 873 మంది బాధితులకు రూ.7,10,000 నగదును సిబ్బంది పంపిణీ చేశారని చెప్పారు.

స్వచ్ఛందంగా మురుగు కాలువ శుభ్రం

గూడూరు: భారీ వర్షాలకు పంట పొలాల్లో నిలిచిన నీటిని బయటకు పంపే చర్యల్లో భాగంగా రైతులు స్వచ్ఛందంగా మురుగు కాలువలో గుర్రపుడెక్క తొలగింపు పనులను చేపట్టారు. సర్పంచి రాజులపాటి రేణుకమ్మ ఆధ్వర్యంలో 30 మంది రైతులు మురుగు కాలువలోని గుర్రపుడెక్క తొలగింపు పనులను రెండు రోజులుగా చేస్తున్నారు. కాలువలో నీటి ప్రవాహం పెరిగి పొలాల్లో పంట బయట పడుతోంది. ఫలితంగా పంట నష్టం కొంత మేరకైనా తగ్గుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక

గూడూరు: విజయనగరంలో శుక్రవారం నుంచి ఈనెల 10వ తేదీ వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు గూడూరు క్రీడాకారుడు నిమ్మగడ్డ హర్షిత్‌కుమార్ ఎంపికయ్యాడు. అండర్-17 విభాగంలో జరిగిన ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టు ఎంపికలో నిమ్మగడ్డ హర్షవర్ధన్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యాడు.

కౌలు రైతులను ఆదుకోవాలి



చల్లపల్లి: మిచాంగ్ తుపాను కౌలు రైతులను నిండా ముంచేసింది. చల్లపల్లి మండలం పాగోలు శివారు లంకతోటకు చెందిన కౌలు రైతు కుందేటి కోటేశ్వరరావు ఈ ఏడాది ఎకరాకు 22 బస్తాలు కౌలు చెల్లించే ఒప్పందంతో ఎనిమిది ఎకరాల్లో 1061 రకం వరిసాగు చేశాడు. మిచాంగ్ తుపానుకు కురిసిన వర్షాలకు వరి పనలు నీటిలో తేలుతున్నాయి. ఎంతోమంది కౌలు రైతుల పరిస్థితి ఇలానే ఉంది. కౌలు రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

పంటల పరిశీలన

గూడూరు: తుపానుకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు భరోసా ఇచ్చారు. మండలంలోని నారికేడాలపాలెం, కంకటావ, ముక్కొల్లు గ్రామాల్లో పర్యటించిన ఎంపీపీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే జిల్లాలకు మంత్రులను పంపించి క్షేత్రస్థాయిలో పంట నష్టం వివరాలు తెలుసుకున్నారన్నారు. పంట దెబ్బతిన్న రైతులను అన్నివిధాలా ఆదుకునేలా మార్గదర్శకాలు ఇచ్చారని చెప్పారు. రైతులు అధైర్యపడవద్దన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, గూడూరు మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఫైజుల్ రహ్మన్, వైఎస్సార్ సీపీ గూడూరు మండల కన్వీనర్ పర్లం పెదబాబు, తహసీల్దార్ బి.విజయప్రసాద్, ఏఓ జి.వి.శివప్రసాద్ పాల్గొన్నారు.

తుపాను బాధితులకు ప్రభుత్వం అండ



బంటుమిల్లిలో చెక్కులు అందజేసిన మంత్రి జోగి రమేష్



కృత్తివెన్నులో బాధితులకు చెక్కులు అందజేసిన మంత్రి జోగి రమేష్

మంత్రి జోగి రమేష్

కృత్తివెన్ను: తుపాను బాధితులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. మిచాంగ్ తుపాను సమయంలో పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధిత 44 కుటుంబాలకు రూ. 72 వేల విలువచేసే చెక్కులను గురువారం కృత్తివెన్ను మండల పరిషత్ కార్యాలయంలో అందజేసి మంత్రి మాట్లాడారు. తుపాను వల్ల మనకు ఆపద ఉందని తెలిసిన వెంటనే సీఎం జగనన్న ప్రమాద తీవ్రత ఉన్న ప్రాంతాల్లో సురక్షిత కేంద్రాలను ఏర్పాటుచేసి ప్రజలను శిబిరాలకు తరలించేలా చర్యలు తీసుకున్నారన్నారు. బాధితులకు మంచి భోజనంతోపాటు అన్ని రకాల వసతులు కల్పించారని వివరించారు. ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, వెంకట్రాజు, కె. బాపూజీ, భూపతిరాజు, షహానా బేగం, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, ఎంపీడీఓ పిచ్చిబాబు పాల్గొన్నారు.

● బంటుమిల్లి: పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న తుపాను బాధితులకు మంజూరైన ఆర్థిక సాయాన్ని మంత్రి జోగి రమేష్ అందజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాలుగు కేంద్రాల్లో పలు గ్రామాలకు చెందిన 59 కుటుంబాలకు రూ. 1.33 లక్షల విలువచేసే చెక్కులను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మనసున్న మంచి మనిషని, బాధితులను ఆదుకోవడంలో ఆయన ముందుంటున్నారని చెప్పారు. పంటలు నష్టపోయిన రైతులకు కూడా పరిహారం అందజేస్తామన్నారు. ఎంపీపీ వి. చినబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ పి. బాబూరావు, తహసీల్దార్ ఎంవీ సత్యనారాయణ, ఎంపీడీఓ జె. స్వర్ణభారతి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

దీపం.. దేదీప్యమానం

● భక్తిశ్రద్ధలతో కోటి దీపోత్సవం
● పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు



కోటి దీపాల వెలుగులో మహాశివుని విగ్రహం (ఇన్‌సెట్) దీపాలు వెలిగిస్తున్న పేర్ని కిట్టు, నాయకులు

మచిలీపట్నంటౌన్: రాబర్ట్‌సన్ పేటలోని పర్వతవర్ధని, రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో గురువారం కోటి దీపోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలోని 35 అడుగుల పరమశివుని విగ్రహం వద్ద ఉన్న ఆవరణతో పాటు ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కోటి దీపాలను భక్తులు వెలిగించారు. ఆలయ ముఖ్య అర్చకుడు ఘంటసాల భాస్కరశర్మ, అర్చకుడు పొక్కునూరి మాధవశర్మ శివుని విగ్రహం వద్ద పూజాదికాలు నిర్వహించారు. స్వామివారికి హారతులు ఇచ్చారు. దీపాల వెలుగులో ఆలయ ప్రాంగణం దేదీప్యమానంగా వెలుగొందింది. తొలుత తిరుపతికి చెందిన శతావధాని ఆముదాల మురళి కార్తిక మాసం, దీపారాధన ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు. శివుని ప్రార్థన వల్ల కలిగే ప్రయోజనాలను తెలిపారు. దీపం అజ్ఞానాన్ని, చీకట్లను పారద్రోలి మనిషికి జ్ఞానాన్ని, వెలుతురును ఇస్తుందన్నారు. ప్రతి ఒక్కరు మనసులోని అజ్ఞానాన్ని తొలగించుకునేందుకు దీపం ఉపయోగపడుతుందని చెప్పారు. దీపం పరమేశ్వరుడి స్వరూపమని, దీపం వెలిగితే అశాంతి ఉండదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా నాయకుడు వేముల కృష్ణ దంపతులు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పల్లపోతు సుబ్రహ్మణ్యం దంపతులు, ట్రాఫిక్ డీఎస్పీ రమేష్‌బాబు దంపతులు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ బూరగడ్డ రమేష్‌నాయుడు దంపతులు, ఆలయ మాజీ చైర్మన్ దేసు సుబ్రహ్మణ్యేశ్వరరావు దంపతులు, ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు కోట జయరాం దంపతులు, బచ్చుపేట వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ ముత్తేవి రవికాంత్, రిటైర్డ్ ఈఓ జక్కా ధర్మారాయుడు, మచిలీపట్నం డివిజన్ దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కగ్గా శ్రీనివాస్, పలు ఆలయాల ఈవోలు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఐదు లక్షల వత్తుల దీపాలు 12, 3 లక్షల వత్తుల దీపాలు 7, లక్ష వత్తులు 125, 365 వత్తులు సుమారు 1000 వరకు వెలిగించారు. కార్యక్రమాన్ని ఆలయ ఈఓ డి. సుబ్బారెడ్డి పర్యవేక్షించారు.

బుద్ధప్రసాద్ తప్పిదం వల్లే ముంపు

● రూ. కోట్ల నిధులు వచ్చినా అవుట్‌ఫాల్ స్లూయిస్ నిర్మించలేదు
● విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: మానవ తప్పిదం వల్లనే పంట పొలాలు ముంపు బారిన పడ్డాయని మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ విమర్శించడం విడ్డూరంగా ఉందని, ఆయన తప్పిదం వల్లనే దివిసీమ రైతులకు ఈ దుస్థితి వచ్చిందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డెల్టా ఆధునికీకరణకు కోట్లాది రూపాయల నిధులు వచ్చినా అవుట్‌ఫాల్ స్లూయిస్‌లు కొత్తవి కట్టకపోవడం వల్లనే మురుగునీరు త్వరగా వెళ్లక పంటపొలాలు ముంపు బారిన పడ్డాయని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయడం వల్ల తుపాను విపత్తుకు మరణాలు, పశునష్టం లేకుండా చూడగలిగామన్నారు. చంద్రబాబులా తుపాన్లను దారి మళ్లిస్తానని, రెయిన్‌గన్‌లతో పంట పొలాలను తడిపేస్తామని డాబులు చెప్పమన్నారు. తుపాను వల్ల నష్టపోయిన ప్రతి రైతును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకుంటారని తెలిపారు. ప్రతిపక్షాలు నిజాలు చెబితే సమస్యలుంటే సరిచేసుకుంటామని, లేనిపోని విమర్శలు చేస్తే ప్రజలు విశ్వసించరన్నారు. విపత్తులొచ్చినా, ఆపదలో ఉన్నా ఎప్పుడూ ప్రజల చెంతనే ఉంటున్న తనను చూసిన బుద్ధప్రసాద్ నాలుగు రోజుల నుంచి పొలాల బాట పట్టడం మంచి పరిణామమన్నారు. ప్రతిపక్ష నేత అంటే ఇలాగే ప్రజల మధ్యనే ఉండాలన్నారు. ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు మాట్లాడుతూ తుపాను వల్ల రైతులు నష్టపోకుండా ఉండేందుకు ధాన్యం సేకరణలో నిబంధనలను ప్రభుత్వం సడలించిందని చెప్పారు. ధాన్యం అమ్మకాల్లో రైతులు ఎక్కడా ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. సమావేశంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, పట్టణ కన్వీనర్ అన్నపరెడ్డి రాందాస్, మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్‌బాషా పాల్గొన్నారు.

అక్షరాస్యతపై అవగాహన

మోపిదేవి: ప్రతి ఒక్కరూ అక్షరాస్యత కలిగి ఉండాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ మోపిదేవి బ్రాంచి మేనేజర్ సాల్మ్ సుల్తానా సయిద్ అన్నారు. నాగాయితిప్ప, మేళ్లమర్తిలంక గ్రామాల్లో బ్యాంక్ ఆధ్వర్యంలో అక్షరాస్యతపై గురువారం కళాజాతా కార్యక్రమం నిర్వహించారు. మేనేజర్ మాట్లాడుతూ పొదుపు ఖాతాల వల్ల ప్రయోజనాలు, రుణ సౌకర్యం తదితర సేవలను వివరించారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు, నగదు రహిత లావాదేవీలు, ఏటీఎం రూపే డెబిట్ కార్డు వాడటం వల్ల కలిగే లాభాలు తదితర అంశాలపై కళాజాతా బృందం ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నామని చెప్పారు. పీఏసీఎస్ చైర్ పర్సన్లు గరికిపాటి గోవిందరాజులు, రెడ్రౌతు వెంకట రమణ, కార్యదర్శులు బోగాది లంకేశ్వరరావు, ఏసుబాబు సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

వికసిత్ భారత్ గ్రామ సభ

చల్లపల్లి: చల్లపల్లి గ్రామ పంచాయతీలో వికసిత్ భారత్ గ్రామ సభ గురువారం నిర్వహించారు. ఎంపీడీఓ చేకు చినరాట్నాలు గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. వికసిత్ భారత్ కార్యక్రమం ప్రాధాన్యత వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ తుంగల వెంకట గిరి, జెడ్పీటీసీ రాజులపాటి కల్యాణి, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, పీఏసీఎస్ చైర్మన్ పాగోలు నాగ సీతారామారావు (ఫణి), ఏఓ జి.సాయిసింధు, మండల వైద్యాధికారి డాక్టర్ కేవీ పద్మావతి, పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు పాల్గొన్నారు.

పురిటిగడ్డలో..

పురిటిగడ్డ పంచాయతీలో గురువారం సాయంత్రం వికసిత్ భారత్ గ్రామ సభ నిర్వహించారు. పంచాయతీ ఈఓ పి.రాంబాబు ఆధ్వర్యంలో గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పరుచూరి వెంకటేశ్వరరావు, మాలెంపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల రక్షణకు తక్షణ చర్యలు

ఉద్యాన శాఖాధికారుల పర్యటన



గాలికి పడిపోయిన అరటి గెలను చూపుతున్న రైతు

మోపిదేవి: మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన ఉద్యాన శాఖాధికారులు తుపాను వల్ల దెబ్బతిన్న వాణిజ్య పంటలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. పొలంలో ఉన్న అధిక నీటిని బయటకు తీసి వేయాలన్నారు. అధిక వర్షాల కారణంగా మిరప, టమాటా పంటలలో బాక్టీరియా, ఆకు మచ్చ తెగులు ఆశించే అవకాశం ఉంటుందని, దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు, ప్లాంటిమైసిన్ ఒక గ్రాము చొప్పున 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మిరపలో కాయకుళ్లు తెగులు సోకకుండా ప్రోపికోనజోల్ ఒక మిల్లీలీటరు లేదా సాఫ్ 2.5 గ్రాముల చొప్పున లీటరు నీటిలో కలిపి 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలని సూచించారు. పసుపులో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దుంపకుళ్లు ఆశించి నష్ట పరిస్తుందని, ముందస్తు చర్యగా కాపర్ ఆక్సిక్లోరైడ్ మూడు గ్రాముల చొప్పున లీటరు నీటిలో కలుపుకుని మొక్క చుట్టూ నేలను తడిపాలని రైతులకు వివరించారు. ఆదర్శ రైతులు గరికిపాటి వీరాంజనేయులు, గరికిపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెడన: మద్యం అతిగా సేవించవద్దని మందలించినందుకు ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెడన మండలం లంకలకలువగుంట గ్రామానికి చెందిన గంటా నాగరాజు (35) అతిగా మద్యం సేవిస్తుండటంతో కుటుంబ సభ్యులు మందలించారు. నాగరాజు ఈ నెల ఒకటో తేదీన గడ్డిమందును తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు ఆయనను గుడివాడ ప్రభుత్వాస్పత్రికి, అక్కడ నుంచి మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. మెరుగైన వైద్యం కోసం విజయవాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు ఉదయ్‌కిరణ్ ఫిర్యాదు మేరకు పెడన పోలీసులు కేసు నమోదు చేశారు.

రిక్షాపుల్లర్ మృతి..

కోనేరుసెంటర్: బైక్ ఢీ కొన్న ఘటనలో అపస్మారక స్థితిలోకి వెళ్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రిక్షా పుల్లర్ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచిలీపట్నం జెడ్పీ సెంటర్‌కు చెందిన చలమలశెట్టి ఆంజనేయులు (60) రిక్షా తొక్కుతూ జీవిస్తుంటాడు. ఈ నెల 4వ తేదీ రాత్రి లక్ష్మీటాకీస్ సెంటర్ నుంచి ఇంటికి వెళుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ఘటనలో ఆంజనేయులు రోడ్డుపై పడిపోగా స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆంజనేయులు ఒంటిపై దెబ్బలు లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకువెళ్లారు. కొద్ది సేపటికి ఆంజనేయులు అపస్మారకస్థితికి చేరుకోవడంతో చికిత్స నిమిత్తం మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రంగా విగ్రహం ఏర్పాటుకు అనుమతించాలని వినతి

నాగాయలంక: దివంగత మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగా విగ్రహాన్ని నాగాయలంకలో ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని 15 కాపు కుల సంఘాలు ఐక్యంగా మండల శ్రీకృష్ణదేవరాయ కాపు సంక్షేమ సాంఘిక సేవా సంఘం ఆధ్వర్యంలో విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మండల సంఘం అధ్యక్షుడు భోగాది సోమశేఖర్ (చిన్నారి), ఉపాధ్యక్షుడు తోట శ్రీనివాసరావు నేతృత్వంలో పలువురు కాపు నాయకులు గురువారం పంచాయతీ కార్యదర్శి జరుగు పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. విగ్రహం ఏర్పాటుకు నాలుగు కూడళ్లను వినతిపత్రంలో ప్రతిపాదించారు. కార్యదర్శి మాట్లాడుతూ ఇందుకు సంబంధించి ఆయా ప్రాంతాలకు సంబంధించి ఎన్‌ఓసీ కావాల్సి ఉందని, స్థలం కేటాయింపు, అనుమతి నిర్ణయం పంచాయతీ పాలకవర్గం తీర్మానం అనుసరించి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో భోగాది శివవిష్ణువర్ధన్, ఎ.శివసాంబశివరావు, పేర్ల శ్రీహరి, వద్రే యేగేశ్వరరావు, పేర్ల కుటుంబరావు పాల్గొన్నారు.

బాధిత రైతులకు న్యాయం చేస్తాం

● ఎమ్మెల్యే రమేష్‌బాబు
● తుపానుకు దెబ్బతిన్న పంటల పరిశీలన



మురుగు డ్రెయిన్ దాటి వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

మోపిదేవి: మిచాంగ్ తుపానుకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో తుపానుకు దెబ్బతిన్న వరి పంటను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. నియోజకవర్గంలో తుపానుకు జరిగిన నష్టం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి రైతులకు న్యాయం చేస్తామని, రైతులు ధైర్యంగా ఉండాలని చెప్పారు. తుపానును దృష్టిలో పెట్టుకుని ఆఫ్‌లైన్ ద్వారా 92 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, దాన్ని ఆన్‌లైన్ చేసేందుకు అనుమతులు తెచ్చామని తెలిపారు. ఇరిగేషన్, డ్రెయినేజీ, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం బాగా పని చేయడంతో ప్రాణనష్టం జరగలేదన్నారు. జిల్లా కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ జాషువా జిల్లా యంత్రాంగంతో బాగా పనిచేయించారన్నారు. వెంకటాపురంలో మురుగు డ్రెయిన్ నుంచి పంట పొలంలోకి నీరు వెళుతున్నట్లు గమనించి ఇరిగేషన్ అధికారి పి. వెంకటేశ్వరరావుకు ఫోన్‌చేసి ఘటనా స్థలానికి రప్పించారు. త్వరితగతిన మురుగునీరు పంట పొలంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ తుమ్మా సోములమ్మ, వివిధ విభాగాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పొలాల్లో వర్షం నీటి తొలగింపునకు చర్యలు

● విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించం
● టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజాబాబు



టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): తుపానుకు కురిసిన భారీ వర్షాలకు పంట పొలాల్లో నిలిచిన వర్షం నీటిని వెంటనే తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆయన చాంబర్ నుంచి క్షేత్ర స్థాయి అధికారులతో గురువారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధాన్యం సేకరణ, ఓటర్ల జాబితా సవరణ, తుపాను సహాయక చర్యలు తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ తుపానును రాత్రింబవళ్లు కష్టపడి సమర్థవంతంగా ఎదుర్కొన్నందుకు అభినందించారు. వరి పంటలు వర్షం నీటిలో మునిగాయని, ఈ నీటిని తక్షణమే బయటకు పంపేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా మేజర్, మీడియం డ్రెయిన్లలో వర్షం నీటి ప్రవాహం సజావుగా సాగాలని, పిచ్చి మొక్కలు, చెత్త ఉండటంతోనే పొలాల్లోకి నీరు వస్తోందన్నారు. కాలువల నిర్వహణ సరిగా లేదని, దీంతో పంట పొలాల్లోకి నీరు చేరుతున్న దృష్ట్యా ఇంజినీరింగ్ అధికారులు వెంటనే నీటి ప్రవాహం సాఫీగా జరిగేలా పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించే పనులను ముమ్మరంగా చేపట్టాలన్నారు. కాంట్రాక్టర్లు చేసిన పనులకు సంబంధించి ఫొటోలు తీసి పంపాలని చెప్పారు. మైనర్ డ్రెయినేజీల్లో నీరు నిల్వ ఉండకుండా ఉపాధి హామీ పథకం ద్వారా డ్వామా పీడీతో సమన్వయం చేసుకుని పనులను చేపట్టాలన్నారు. ఇందులో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ అపరాజితసింగ్, డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో నీటి తొలగింపు



ఇంజిన్లతో నీరు తోడుతున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: మిచాంగ్ తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లోని ముంపునీటిని తొలగించాలని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) నగర పాలక సంస్థ అధికారులను ఆదేశించారు. తొలగింపు పనులు గురువారం ప్రారంభించారు. ఇంజిన్లను ఏర్పాటు చేసి పల్లపు ప్రాంతాల్లోని నీటిని తోడుతున్నారు. 11వ డివిజన్‌లో పనులను వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి గూడవల్లి నాగరాజు పర్యవేక్షించారు.

● పెడన: పట్టణంలోని రామలక్ష్మి వీవర్స్ కాలనీ, వైఎస్సార్ కాలనీ, మొగ్గయ్య కాలనీ, దక్షిణ తెలుగుపాలెం పరిసరాల్లోని లోతట్టు ప్రాంతాలు ముంపు బారిన పడ్డాయి. మంత్రి జోగి రమేష్ ఆదేశాలతో మున్సిపల్ అధికారులు మోటార్లను పెట్టి నిల్వ ఉన్న నీటి తొలగింపు పనులను చేపట్టారు. మిగిలిన కాలనీలలో కూడా ఒకటి, రెండు రోజుల్లో నీటిని బయటకు తోడిస్తామని కమిషనర్ మహేంద్ర తెలిపారు.

జగన్ పాలనలో పేదలకు మేలు

పెడన ఎంపీపీ రాజులపాటి వాణి



సంక్షేమబోర్డును ఆవిష్కరించిన ఎంపీపీ వాణి

పెడన: పేదలకు మేలు చేసే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలిచి ఆశీస్సులు అందజేయాలని పెడన ఎంపీపీ రాజులపాటి వాణి అన్నారు. గురువారం మండలం కాకర్లమూడి గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి, పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డును, వైఎస్సార్ సీపీ పతాకాన్ని నాయకులతో కలిసి ఆవిష్కరించారు. గ్రామంలో గడప గడపకు వెళ్లి సీఎం జగన్ పాలనలో జరిగిన మేలును వివరించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొండవీటి నాగబాబు, నాయకులు గరికపాటి వెంకట రామానాయుడు, పరసా రాజేష్, తుమ్మా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి

చిలకలపూడి(మచిలీపట్నం): తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు చేనేత కార్మికులు ఎంతో నష్టపోయారని, వారిని ఆదుకోవాలని ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు బండారు ఆనంద ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ పి. రాజాబాబును ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాలకు చేనేత కార్మికుల పూరిళ్లు దెబ్బతినడంతో పాటు మగ్గం గోతుల్లోకి వర్షం నీరు చేరి నూలుతో పాటు ముడి సరుకులు కూడా పాడైపోయాయన్నారు. మగ్గంలోకి నీరు చేరుకున్న వారికి ఇంకిపోవడానికి 15 రోజుల సమయం పడుతుందన్నారు. తక్షణం సర్వే చేయించి చేనేత కార్మికులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పిచ్చుక ఫణికుమార్, ఆకురాతి జనార్దన్, కాలెపు సూరిబాబు, బొడ్డు నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

పంటల రక్షణలో రైతులు నిమగ్నం

కృత్తివెన్ను: తుపానుకు చేతికొచ్చిన పంట నీటిపాలయ్యింది. బుధవారం వర్షం తగ్గుముఖం పట్టడంతో రైతులు పంట పొలాలకు పరుగులు తీశారు. తడిసిపోయిన వరి పనలను తిరగేసి ఆరబెడుతున్నారు. యండపల్లి, నీలిపూడి, చినపాండ్రాక, చెరుకుమిల్లి, సంగమూడి, ముని పెడ తదితర గ్రామాల్లో వరి చేలు గాలులకు పడిపోయి నీటమునిగాయి. ప్రతి రైతును ఆదుకుంటామన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటన రైతుల్లో మనోధైర్యాన్ని నింపింది. మండల వ్యాప్తంగా 2,270 ఎకరాల్లో వరి, 400 ఎకరాల్లో వేరుశనగ, 100 ఎకరాల్లో మినుము పంట నష్టపోయినట్లు అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు.

● మోపిదేవి: మండలంలోని పలు గ్రామాల్లో ముంపులో ఉన్న వరి పనలను తిప్పి ఆరబెడుతున్నారు. తడిసిన ధాన్యాన్ని రహదారుల వెంట రాశులుగా పోసి ఆరబెడుతున్నారు. ఆదరాబాదరాగా బస్తాల్లోకి ఎత్తుతున్న రైతులు, రాశులను ఆరబెడుతున్న కర్షకులు ప్రతి గ్రామంలో కనపడుతున్నారు. సాయం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

చెట్లు తొలగించి.. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

మచిలీపట్నంటౌన్: తుపాను ప్రభావంతో వీచిన పెనుగాలులకు 12వ డివిజన్‌లో మూడు భారీ వృక్షాలు నేలకూలాయి. ఆయా ప్రాంతాల్లో ఐదు విద్యుత్ స్తంభాలు కూడా కూలి లైన్లు దెబ్బతిన్నాయి. నగర పాలక సంస్థ, విద్యుత్ సిబ్బంది రెండు రోజులుగా శ్రమించి గురువారం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. తొలుత భారీ వృక్షాలను తొలగించి తరువాత దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.